సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ၊ 15 ၊ జూలై ၊ 2024



సోమశిలలో 9.900 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 9.900 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 60 క్యూసెక్కులు వస్తుండా, దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,540
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,769
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,972
సవర (8 గ్రాములు)	రూ.55,776

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.7 /25.2

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 86 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ప్రిన్సిపల్స్ సమావేశం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సమావేశం ఈ నెల 16న స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, యూడైస్, అఫిలియేషన్లు తదితర వివరాలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి డీవీఈఓ మధుబాబు, యూడైస్ రీసోర్స్ పర్సన్స్ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

శివాలయంలో గుప్తనిధులకు తవ్వకాలు



దేవుడి కల్యాణం నిర్వహించే మండపాన్ని నేలమట్టం చేసిన దుండగులు

కలిగిరి: మండలంలోని వెలగపాడులోని పురాతన శివాలయం ఆవరణలో ఉన్న కల్యాణ మండపంలో గుప్త నిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఆలయ ధర్మకర్త ఎస్వీ రామకృష్ణ సమాచారం మేరకు.. గ్రామ పొలిమేరలో ఉన్న శివాలయం శిథిలావస్థకు చేరడంతో వేరే ప్రాంతంలో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. పాత శివాలయం వద్ద గుప్తనిధులు ఉన్నాయనే నమ్మకంతో కొంత మంది వ్యక్తులు అక్కడ తవ్వకాలు జరుపుతున్నారన్నారు. దేవుడి కల్యాణం నిర్వహించే మండపాన్ని కూల్చి వేశారు. ఊరుశివారు ప్రాంతంలో ఉండడంతో ఎప్పుడు తవ్వకాలు చేశారో గుర్తించలేదన్నారు. ఆదివారం అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించడంతో వెళ్లి చూశామన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదివారం కోరారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

బీచ్ కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక



ఇందుకూరుపేట: ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు ఎంకేఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే పమజుల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు, పురుషుల జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే క్రీడ కబడ్డీ అన్నారు. ఈ ఆటకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా నిలిచి జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టాలని కోరారు. క్రీడా నైపుణ్యం ప్రదర్శించి క్రీడాకారులు ఉన్నతంగా ఎదిగేందుకు ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. కబడ్డీ క్రీడకు మంచి భవిష్యత్ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయుడు, ఇంతియాజ్, వెంకటేశ్వర్లు, ఎన్వీ రమణయ్య, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఫ్లైఓవర్

నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిలో వెంకటేశ్వరపురం వద్ద రైల్వే ట్రాక్‌పై ఫ్లై ఓవర్ ప్రమాదకరంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 'టీ' ఆకారంలో వెంకటేశ్వరపురంలో ఫ్లై ఓవర్ నిర్మించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోనే ఇది రెండోదిగా పేరొందింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ వంతెనపై ఆత్మకూరు వైపు వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు మధ్యలో భారీగా గొయ్యి ఏర్పడింది. వంతెనపై పిల్లర్ల మధ్య రబ్బర్ జాయింట్ల వద్ద కూడా దెబ్బతింది. కర్ణాటక– కృష్ణపట్నం మధ్య ఐరన్ ఓర్, బొగ్గు రవాణాకు ఇదే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- ఏ క్షణంలోనైనా పూర్తిగా కూలేందుకు సిద్ధం
- భయాందోళనలో వాహనదారులు
- మరమ్మతులకు నోచుకోని బ్రిడ్జి
- రంగులతో సరిపెడుతున్న పాలకులు
- ప్రమాదబారిన పడుతున్న ప్రయాణికులు

కుంగిన వెంకటేశ్వరపురం వంతెన



బ్రిడ్జిపై రాకపోకలను నిషేధిస్తూ బ్యారికేడ్లు ఏర్పాటు



ఫ్లై ఓవర్‌బ్రిడ్జి పై గొయ్యి పడిన దృశ్యం

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నిత్యం లైట్ వాహనాల నుంచి భారీ లోడుతో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న వెంకటేశ్వరపురం ఫ్లైవర్ బ్రిడ్జి ప్రమాద స్థితిలో ఉంది. వంతెన మధ్యలో ఒక్కసారిగా కుంగిపోవడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ వంతెనపై ప్రయాణికులు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రోజుల నుంచి ఈ బ్రిడ్జిపై ఉన్న గుంతలతో వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పూడ్చకుండా బ్రిడ్జి గోడలకు పెయింట్ వేస్తూ పైపై మెరుగులు చేస్తూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిష్టాత్మకమైన వంతెన

నెల్లూరు నగరంలో పెన్నా బ్రిడ్జి దాటగానే వెంకటేశ్వరపురం వద్ద నెల్లూరు– ముంబయి మార్గంలో రైల్వే ట్రాక్ ఉంది. రైల్వే గేటు వేస్తే నెల్లూరు– కావలి– ఆత్మకూరు మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు 'టీ' ఆకారంలో ఫ్లై ఓవర్ నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా ఆత్మకూరు, కావలి వైపు రోజూ వేలాదిగా బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రయాణియిస్తున్నాయి. ఇంతటి రద్దీ కలిగిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి శనివారం ఉదయం ఒక్కసారిగా కుంగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బ్రిడ్జి పైన ఉన్న రోడ్డు పగిలిపోయి విరిగిపోవడంతో పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించేందుకు వాహనదారులు ఏ క్షణంలో బ్రిడ్జి కూలిపోతుందని హడలిపోయారు. సమాచారం తెలుసుకున్న నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కుంగిపోయిన బ్రిడ్జిపై బ్యారికేడ్లు ఏర్పాటు చేసి భారీ వాహనాలు (లారీలు, బస్సులు, టిప్పర్లు) రాకపోకలను నిషేధించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మూడు వైపులా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు రాకుండా నిలిపివేశారు.

మరమ్మతులు చేయకుండా పైపై సొగసులు

వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన రోడ్డు మొత్తం గుంతలమయంగా ఉంది. బ్రిడ్జి కుంగిపోయి ప్రమాద్ర స్థితిలో ఉంటే కనీసం సంబంధిత శాఖాధికారులు కానీ, మంత్రులు కానీ పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆదివారం నెల్లూరులో ఉన్న మంత్రులు సోమశిల పర్యటకు వెళ్లాల్సి ఉండడంతో మరో మార్గంలో తీసుకెళ్లారే తప్ప.. వంతెన పరిస్థితిని చూపించాలనే సోయ అధికారులకు లేకుండా పోయింది. బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఆదివారం నుంచి వంతెన గోడలకు రంగులు వేసే వేస్తూ షో చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నాం



గత నెల రోజుల నుంచి వెంకటేశ్వరపురం ఫ్లైవర్ బ్రిడ్జి పరిస్థితి దారుణంగా తయారయింది. నేను నిత్యం నెల్లూరు నగరం నుంచి కోవూరుకు వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపై నుంచే ప్రయాణిస్తున్నాను. అయితే బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల కారణంగా రాత్రి సమయాల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయకపోవడం ఎంతో బాధాకరం.

– శ్రీనివాస్, కోవూరు, ప్రయాణికుడు

బ్రిడ్జి ఏ సమయంలోనైనా కూలిపోతుంది



వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో నేడు ఏకంగా బ్రిడ్జి కుంగిపోయే పరిస్థితి ఏర్పడింది. సుదూర ప్రాంతాల నుంచి రొట్టెల పండగకు ఈ బ్రిడ్జిపై నెల్లూరుకు వచ్చే భక్తులకు ఈ బ్రిడ్జి వల్ల ఏమైనా ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

– ఆనంద్, ఆన్‌లైన్ సర్వీస్ నిర్వాహకుడు

అప్రమత్తంగా ఉన్నాం



వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కుంగిపోయిందన్న సమాచారంతో వెంటనే భద్రతా చర్యలు చేపట్టాం. బ్రిడ్జిపై భారీ వాహనాలకు నిలుపుదల చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాం. బ్రిడ్జిపై కుంగిన ప్రాంతంలో బ్యారికేడ్లు పెట్టి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూస్తున్నాం. ఆత్మకూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించాము. రాత్రి సమయాల్లో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా వెళ్లండి.

– శివాజీ, నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ

పెనుప్రమాదం తప్పింది



వెంకటేశ్వరపురంలో నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి కొన్ని రోజుల నుంచి గుంతలమయంగా ఉంది. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా రైల్వేలైన్లపై నిర్మించిన బ్రిడ్జి కుంగిపోవడం వల్ల రైలు వచ్చే సమయంలో బ్రిడ్జి కూలిపోతే పెను ప్రమాదం జరుగుతుంది. ఈ సమయంలో ఎలాంటి వాహనాలు ప్రయాణించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఎన్ని సార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదు.

– కత్తి శ్రీనివాసులు, సీపీఎం నగర కార్యదర్శి


ఆనం వర్సెస్ బీద

- నా శత్రువును మంత్రులకు పరిచయం చేస్తావా?
- పార్టీలో సీనియర్ నేత కాబట్టే చేస్తున్నా..
- మంత్రి రామానాయుడి సమక్షంలో వాదోపవాదాలు
- నీకు పరపతి ఉంటే.. నాకూ ఉందంటూ సవాళ్లు
- నివ్వెరపోయిన పార్టీ నేతలు, మౌనం దాల్చిన మంత్రి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా టీడీపీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల మధ్య ఆధిపత్యం కోసం ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. తాజాగా ఆదివారం నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో జిల్లాకు చెందిన మరో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గూటూరు కన్నబాబును ఇటీవల బీద వెంటబెట్టుకుని వివిధ శాఖల మంత్రులకు, పార్టీ ముఖ్య నేతలకు పరిచయం చేశారు. గూటూరుకు ప్రాధాన్యత ఇస్తూ బీద చేస్తున్న చర్యలపై ఆత్మకూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఆనం ఇప్పటికే అసహనంతో ఉన్నారు. ఈ క్రమంలో మంత్రి నిమ్మల ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉండగా, మరో మంత్రి ఆనం, పార్టీ ముఖ్య నేతలతో కలిసి మాట్లాడుతుండగా, అంతలోనే బీద అక్కడికి రావడంతో ఆయన్ను చూడగానే ఆనం బరస్ట్ అయ్యారు. 'ఏమయ్యా.. రవిచంద్ర నాకు వ్యతిరేకంగా పని చేసిన పార్టీ ద్రోహి గూటూరు కన్నబాబును తీసుకెళ్లి పార్టీ పెద్దలు, మంత్రులకు పరిచయం చేయడం బాగుందా?' అంటూ ఆనం ప్రశ్నించారు. అదేందన్నా.. ఆయన మన పార్టీ లీడరే కాదా? పార్టీలో సీనియర్, మంత్రి నారాయణ అందరిని కలుపుకుని పోవాలని చెప్పాడు.. అందుకే అందరిని సమన్వయం చేస్తున్నా.. తప్పేంటూ మాట్లాడారు. ఇద్దరి మధ్య మాటల వాగ్వాదంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణం గంభీరంగా మారిపోయింది. పార్టీ అధిష్టానానికి నీ గురించి చెబుతానంటూ ఆనం అసహనంతో అనగా.. అధిష్టానం వద్ద నాకు పరపతి ఉందంటూ బీద కూడా దీటుగా సమాధానం చెప్పారు. ఒక దశలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం పెరుగుతున్న క్రమంలో ఇంతలో మరో మంత్రి నారాయణ కూడా అక్కడికి రావడంతో ఎవరికి వారు సర్దుకున్నారు. తన సమక్షంలోనే తన సహచర మంత్రి, పార్టీ నేత వాగ్వాదం పడుతున్నా.. నిమ్మల మౌనం దాల్చడంపై పార్టీ నేతలు పెదవి విరిచారు. రాజకీయాల్లో సీనియర్ అయిన ఆనం తన హుందాతనాన్ని పక్కన పెట్టేసి ఇలా నలుగురు సమక్షంలో వాగ్వాదం పడడం చూసి విస్తుపోయారు.

సోమశిల రక్షణ పనులకు అధిక ప్రాధాన్యత

- 60 రోజుల్లో ఆప్రాన్ పనులు పూర్తి
- జలవనరులశాఖ మంత్రి నిమ్మల
- జలాశయాన్ని పరిశీలించిన మంత్రులు నిమ్మల, ఆనం, పొంగూరు



సోమశిల జలాశయం ఆప్రాన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

సోమశిల: సోమశిల జలాశయం వద్ద పెండింగ్ పడిన ఆప్రాన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం సోమశిల జలాశయాన్ని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. తొలుత జలాశయం వెలుపల క్రస్ట్‌గేట్ల సమీపంలో ఆప్రాన్ పనులను పరిశీలించారు. అనంతరం 2021 వరదల వల్ల దెబ్బతిన్న సోమేశ్వరాలయాన్ని పరిశీలించి సోమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ పునర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జలాశయం మట్టి కట్టడం, ఆర్‌హెచ్‌ఆర్, క్రస్ట్‌గేట్లు పరిశీలించారు. మంత్రి ఆనం జలాశయం నీటి నిల్వ, లభ్యత వివరాలను మంత్రి నిమ్మలకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో సోమశిల జలాశయం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. రాబోయే వర్షాకాలం దృష్ట్యా త్వరితగతిన ఆప్రాన్ నిర్మాణాన్ని పూర్తిచేయకపోతే డ్యామ్ మునుగడకే ప్రమాదమన్నారు. తక్షణమే ఆప్రాన్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని కృషి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి ప్రాధాన్యతల్లో సోమశిల జలాశయాన్ని చేర్చి పనులను చేస్తామన్నారు.

ఖరీఫ్‌కు సాగునీరిస్తాం: ఆనం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరందిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. చివరి ఆయకట్టు వరకు నీరించి ప్రతి ఎకరా పండిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, రైతులు, సాగునీటి సంఘం నేతలు జలవనరుల శాఖలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదులు చేశారన్నారు. వాటిపై సమగ్ర విచారణ చేపడుతామన్నారు. ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్‌కు సంబంధించి గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు.

ముంపు బాధితులను ఆదుకోండి

సోమశిల జలాశయం కోసం ఇళ్లు, పొలాలు పోగొట్టుకున్నామని, 2015లో ఉద్యోగానికి అర్హులుగా గుర్తించారని, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు అమలు చేయక పెండింగ్‌లో పెడుతున్నారంటూ సోమశిల ముంపు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇచ్చారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి విజ్ఞప్తులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్, నెలవల విజయశ్రీ, సోమశిల, కండలేరు తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈలు బీవీ రమణారెడ్డి, ఎంవీ రమణారెడ్డి, కృష్ణమోహన్, డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఆర్డీఓ మలోల, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఇరిగేషన్ అధికారులు, నాయకులు మాకిరెడ్డి జనార్దన్, ఉప్పల విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలు.. పెనుసవాళ్లు

- పాత కక్షలతో హత్యలు
- తెగబడుతున్న చోరులు
- గుప్పుమంటున మత్తు, మాదకద్రవ్యాలు
- గతి తప్పిన పోలీస్ నిఘా
- తాజాగా రాజకీయ కక్షపూరిత ఘర్షణలు
- నూతన ఎస్పీగా కృష్ణకాంత్ బాధ్యతల స్వీకరణ నేడు

సింహపురి అంటే.. చెంతనే జలజల పారే పెన్నానది. పచ్చని పైర్లతో ప్రశాంతత పుణికి పుచ్చుకున్న పల్లెసీమలు. ఇదంతా గతం. నిన్నటి వరకు రాజకీయ ఆధిపత్యమే కనిపించిన జిల్లాలో ఇప్పుడు రాజకీయ కక్షలు, కార్పణ్యాలు పురివిప్పుతున్నాయి. అధికార పార్టీ వర్గీయుల హింసాత్మక చర్యలు శాంతి భద్రతలు గాడి తప్పాయి. మరో వైపు పేట్రేగుతున్న అసాంఘిక శక్తులు. పాతకక్షలతో పట్టపగలే హత్యలు. తెగబడుతున్న చోరులు. జోరుగా మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు. రక్తమోడుతోన్న రహదారులు. పోలీస్ సిబ్బందిలో పేరుకుపోయిన నిర్లక్ష్యం, అవినీతి వెరసి జిల్లాల్లో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. సోమవారం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న జి. కృష్ణకాంత్ శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైమ్): జిల్లాలో శాంతిభద్రతలు పెను సవాళ్లుగా మారాయి. గడిచిన కొద్ది నెలలుగా జిల్లాలో నేరాలు, ఘోరాలు పెచ్చుమీరాయి. నిన్నటి వరకు అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లు, దొంగల బీభత్సాలు, మత్తు పదార్థాల విక్రయాలతో శాంతిభద్రతలు గాడి తప్పితే.. తాజాగా అధికార పార్టీ రాజకీయ కక్షలు కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా పోలీస్ బాస్‌కు పెనుసవాళ్లుగా మారనున్నాయి. ప్రత్యర్థి రాజకీయ పార్టీల నేతపై ప్రతీకారం తీర్చుకునేందుకు పోలీస్ వ్యవస్థపై రాజకీయంగా ఒతిళ్లు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో 5 సబ్ డివిజన్లు, 12 సర్కిల్స్, 52 రూరల్, 11 అర్బన్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. అధికారం, అర్ధ బలం ఉంటేనే క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 నుంచి 85 మందికి పైగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తున్నారంటే దీనిని బట్టి చూస్తే పోలీసుస్టేషన్ స్థాయిలో పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో కేసులు నమోదు చేసే పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు అధికార పార్టీ నేతల మెప్పు కోసం తప్పుడు కేసులు బనాయిస్తున్న పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం మహిళల భద్రతకు దిశ పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేసి సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో పర్యవేక్షణ కొరవడింది. దిశ పోలీసుస్టేషన్‌లో అవినీతి తార స్థాయికి చేరింది. కేసు నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్ట్, నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంలో కొందరు సిబ్బంది భారీగా నగదు పిండుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మఫ్టీ కానిస్టేబుల్స్‌లో అధిక శాతం మంది అసలు విధులను పక్కన బెట్టి అధికారులకు ఆదాయ వనరులు అవుతున్నారన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్ విభాగంలో అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పలు స్టేషన్లలో రైటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిని పూర్తి స్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

చెలరేగుతున్న నేరగాళ్లు

పోలీసుల ఉదాసీన వైఖరి, రాజకీయ నేతల అండదండలతో నేరగాళ్లు విజృంభిస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల కేసుల్లో అధిక శాతం రౌడీషీటర్లు, పాత నేరస్తులే నిందితులుగా ఉంటున్నారు. గతంలో ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్, రాత్రి గస్తీలో పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉండేది. అయితే ప్రస్తుతం అది అంతంత మాత్రంగానే సాగుతోంది. జైలు మానిటరింగ్ వ్యవస్థ మరుగున పడింది నేరస్తుల కదలికలపై నిఘా కొరవడడంతో యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతోన్నారు. గతంలో పీడీ యాక్ట్‌లు నమోదు చేయడంతో కొంత మేర నేరాలు తగ్గు ముఖం పట్టినప్పటికి ఇటీవల తిరిగి ఊపందుకున్నాయి. ఇక జిల్లాలో పగలు, రాత్రి తేడా లేకుండా చోరులు తెగబడుతున్నారు. గుడి, బడి, ఇళ్లు, కార్యాలయాల్లో ప్రజాధనాన్ని, ఆస్తులను దోచుకెళుతున్నారు. ఓ వైపు పోలీసులు కేసుల్లో నిమగ్నమై ఉండగానే మరో వైపు చోరీలకు పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు. నిన్న మొన్నటి వరకు స్తబ్ధుగా ఉన్న సీసీఎస్, క్రైమ్ పార్టీల్లో కొంత మార్పు రావడంతో నేరస్తులను పట్టుకుని చోరీ సొత్తును రాబడుతున్నారు. ఇప్పటికైనా నిఘా వ్యవస్థను పటిష్టం చేసి నేరాలను కట్టడి చేయాల్సి ఉంది.

మత్తులో జోగుతున్న జిల్లా

జిల్లాలో మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయి. విద్యార్థులు, యువతే లక్ష్యంగా చేసుకుని నిందితులు పెద్ద ఎత్తున వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడ మాదక ద్రవ్యాల విక్రయ ముఠాలను పోలీసులు అరెస్ట్ చేసినా అధిక శాతం కేసుల్లో మూలాలు నెల్లూరులోనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సెబ్, పోలీసులు అడపాదడపా దాడులతో సరి పెడుతున్నారు. వీటిని పూర్తి స్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఇక ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటోంది.

ట్రాఫిక్.. ఇది జటిల సమస్య

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్పీలు మారినప్పుడు కొత్తగా వచ్చిన వారు తొలి ప్రాధాన్యతగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని చెబుతున్నారు. వారి ఆలోచన విధానంతో గతంలో ఉన్న ట్రాఫిక్ నిబంధనలు అటూఇటూ మార్చడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

భక్తజన కోలాహలం



స్వర్ణాల తీరంలో భక్తుల సందడి

నెల్లూరులోని స్వర్ణాల తీరంలో భక్తజన కోలాహలం నెలకొంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ బారాషహీద్ దర్గాలో ఈ నెల 17 నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున ముందస్తుగా స్వర్ణాల తీరానికి ఆదివారం తరలివచ్చారు. స్వర్ణాల చెరువులో వరాల రొట్టెలు మార్చుకున్నారు. బారాషహీద్‌లను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



విద్యుద్దీపాలంకరణలో బారాషహీద్ దర్గా





దర్గా ప్రాంగణంలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన ఆర్చీలు



బారాషహీద్‌లను దర్శించుకుంటున్న భక్తులు



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు





యథేచ్ఛగా కబ్జా

- 120 అంకణాలను ఆక్రమించిన టీడీపీ నేత
- అధికారుల సమన్వయ లోపం
- తమది కాదంటే తమది కాదంటున్న వైనం



ఆక్రమించిన స్థలం చుట్టూ వేసిన ఫెన్సింగ్

ఆత్మకూరు: అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కూటమి పార్టీల నేతలు విలువైన స్థలాల ఆక్రమణల పర్వానికి తెరలేపారు. తాజాగా ఆత్మకూరు పట్టణ పరిధిలోని బట్టేపాడు మార్గంలో కాశీనాయన ఆశ్రమం ఎదురుగా గల సర్వే నంబర్ 172లో సుమారు 120 అంకణాల స్థలాన్ని దర్జాగా ఆక్రమించారు. ఫెన్సింగ్ వేయడంతో పాటు ఓ చిన్నపాటి రేకుల షెడ్డునూ నిర్మించారు.

పొలాన్ని కొని.. ప్రభుత్వ స్థలంపై కన్నేసి

పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత కాశీనాయన ఆశ్రమం ఎదురుగా గల రెండెకరాల పొలాన్ని ఓ రైతు వద్ద కొనుగోలు చేశారు. ఆ పొలం హద్దు నుంచి బట్టేపాడు మార్గం వరకు ఉన్న ప్రభుత్వ స్థలం సైతం తనకే దక్కుతుందంటూ ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. దీనికి తోడు లోపల ఓ రేకుల షెడ్డును సైతం నిర్మించాడు. వాస్తవానికి సమీపంలోని పొలాల రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు.. విక్రయించేందుకు కల్లాలుగా ఈ ఖాళీ స్థలాన్ని ఎన్నో ఏళ్లుగా వినియోగించుకుంటున్నారు.

వివాదాస్పదంగా అధికారుల తీరు..

పక్కనే నీటిపారుదల శాఖ కాలువ ఉండటంతో ఈ స్థలం తమది కాదంటే తమది కాదంటూ రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే అదనుగా ఇటీవల సదరు టీడీపీ నేత స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేయడంతో రైతులు అవాక్కయ్యారు. ఆక్రమించిన స్థలం విలువ సుమారు రూ.పది లక్షలు ఉంటుందని తెలుస్తోంది. ఈ విషయమై ఫిర్యాదు చేసినా.. తమకు సంబంధం లేదని, రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు తెలపడం విశేషం. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాను సంప్రదించగా, అది తమ శాఖ పరిధిలోది కాదని, రెవెన్యూ అధికారులు తమకు అప్పగించలేదని.. వారికే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

సింగపేటలో భారీ చోరీ



బాధితురాలి నుంచి వివరాలను తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటరమణ



డాగ్ స్క్వాడ్ పరిశీలన

- 22 సవర్ల బంగారు, రూ.2 లక్షల నగదు అపహరణ

అల్లూరు: ఇంట్లోకి దొంగలు చొరబడి భారీగా నగదు, బంగారం అపహరించుకెళ్లిన ఘటన అల్లూరు మండలం సింగపేటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కావలి డీఎస్పీ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు...సింగపేటకు చెందిన కే రమణమ్మ రెండు పోర్షన్ల ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. శనివారం రాత్రి ఆమె ఒక పోర్షన్‌కు సంబంధించిన వరండాలో నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు మారుతాళాలతో మరో పోర్షన్ తలుపులు తెరిచి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 22 సవర్ల బంగారంతో పాటు రూ.2 లక్షల నగదును అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం నిద్రలేచిన రమణమ్మ చోరీని గుర్తించి అల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐ నాగభూషణం, ఎస్సై శ్రీనివాసులరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలను సేకరించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. తమ దర్యాప్తులో దొంగలు మారుతాళాలతో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లుగా తెలిసిందని డీఎస్పీ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్సై నాగార్జునరెడ్డి

సంగం: స్థానిక చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఎస్సై నాగార్జునరెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు.

ఆత్మకూరులో విషాదఛాయలు

- కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లికి చెందిన రియాజ్ (30) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం బెంగళూరులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు.. వెంకట్రావుపల్లికి చెందిన రియాజ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఐదేళ్ల క్రితం చెన్నైకు చెందిన యువతితో వివాహమైంది. వీరికి మూడేళ్ల వయస్సు ఉన్న కుమార్తె ఉంది. మొహర్రంకు స్వగ్రామానికి వచ్చే విషయమై దంపతుల మధ్యన స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రియాజ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. రియాజ్ మృతితో వెంకట్రావుపల్లిలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

రేపు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు సర్వీసులు, లాజిస్టిక్ సేవలకు సంబంధించిన సమస్యలతో పాటు సూచనలు, సలహాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. 99592 25095 నంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తెలియజేయాలని కోరారు.

గొలగమూడిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గొలగమూడి గ్రామానికి చెందిన కంటేపల్లి వెంకయ్య(34) నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూల మార్కెట్‌లో పని చేస్తున్నాడు. గొలగమూడిలో వెంకయ్య కొత్తగా ఇంటి నిర్మించుకుంటున్నాడు. ఆ ఇంటి వద్దకు పెయింట్ పని చేసే యువకుడితో కలిసి ఆదివారం వెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్యన చిన్న వివాదం నెలకొంది. ఆ తరువాత కొద్దిసేపటికే వెంకయ్య తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని వెంకయ్యను నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. తన భర్త ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని మృతుడి భార్య జ్యోతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్:	రూ.131
లేయర్ లైవ్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.236
స్కిన్‌లెస్ చికెన్:	రూ.264
లేయర్ చికెన్:	రూ.187



నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

ఎడ్ల బండ్ల పోటీల విజేత యల్లాయపాళెం

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఎడ్ల బండ్ల పోటీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక సబ్‌స్టేషన్ రోడ్డులో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎడ్ల బండ్లు తలపడ్డాయి. యల్లాయపాళెం మన్నవరప్పు మౌనికకు చెందిన గంగమ్మ తల్లి ఎండ్ల బండి ప్రథమ బహుమతి రూ.20,116 నగదును కైవసం చేసుకుంది. గంగపట్నం చాముండేశ్వరి సీఫుడ్స్ ఎండ్ల బండి ద్వితీయ బహుమతి రూ.15,116 నగదును గెలుచుకుంది. అల్లూరు బోగా సుకుమార్‌కు చెందిన



ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ప్రసన్నాంజనేయస్వామి ఎడ్ల బండి తృతీయ బహుమతి రూ.10,116 నగదును గెలుచుకుంది, నరుకూరు నరసింహకు చెందిన యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఎడ్ల బండి నాల్గో బహుమతి రూ.8,116, గంగపట్నం పంచాల మోక్షిత్‌రెడ్డి ఎడ్ల బండి ఐదో బహుమతి రూ.6,116 గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహక కమిటీ సభ్యుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కమిటీ సభ్యులు మాములూరు హజరత్‌రెడ్డి, మన్నారపు శీనయ్య, మన్నారపు సురేష్, ముద్దులూరు వెంకటకృష్ణయ్య, అత్తిరాజుల మనోహర్, కరేటి సందీప్, మేక శ్రీకాంత్, యరగాల ప్రశాంత్, చిల్లకూరు సునీల్ పాల్గొన్నారు.